
# రెండవ తొలిరాత్రి

కథ

- ఇచ్ఛాపురపు రామచంద్రం

గది ద్వారానికి, తారా మణిహారంలా, రంగు రంగుల చిన్నపూల దండలా, ద్వారం ముందు ముగ్గురు ముద్దు గుమ్మలు, ఒక బొద్దు గుమ్మడీ. తెల్ల కంచి పట్టు చీర, తల నిండా పూలు, నొసట రూపాయి కాసంత బొట్టు, పాదాలకు పసుపూ పారాణీ, రెండు చేతులకీ మోచేయి వరకూ గాజు గాజులూ, మధ్య మధ్య బంగారు గాజులూ. సినిమాల్లోను, రవి వర్మ చిత్రాల్లోనూ పతివ్రతల ప్రతిరూపంలా, అరుంధతి, అనసూయ లాంటి పురాణ పాత్రలా ఉంది. ఆ ముగ్గురూ, ఆమే- మూడు సన్నజాజులూ ఒక సంపెంగల్లా ఉన్నారు.



''ఇప్పటికే ఆలస్యమయింది. తొందరగా గది లోకి వెళ్లండి. శోభనం పెళ్లి కూతురుగారూ!'' అంటూ ముగ్గురిలోనూ ఒకరు ఆమెని గదిలోకి నెట్టబోగా, కాదంబరి కొంచెం కోపంగా చూసిందామె వైపు. అయినా లెక్క లేనట్లు, ''కార్యం గదిలో కెళ్లడానికి కొండెక్కి కూర్చునే శోభనపు వధు వులు యీ కాలంలో కలికంలోకి కూడా కనపడరు- కంప్యూటర్లలోనూ, వెబ్‌సైట్‌లలోనూ వెతికి గాలించినా...'' అని నవ్వి, ''పుడ్డయినా బెడ్ అయినా ఫాస్ట్. పేరంటాళ్లు పంపే వరకూ ఆగ కుండా శోభనం పెళ్లికూతురే గది తలుపు తీసుకుని గబ గబ వరుడి దగ్గరకి పరుగెత్తే వేగం రోజులివి,'' అంది రెండో సన్నజాజి. తనేనా తక్కువన్నట్లు మూడో సన్నజాజి, ''నేడు ప్రేమ, రేపు మమ, ఎల్లుండి మాత. తప్పని సరయి పదిమందిలోనూ పెళ్లి చేసుకోవలసి వస్తే, పీటల మీద వధూవ రులూ, వధువుగారి వక్షం మీద పాప లేదా పాపడు. ఇదీ రూలాఫ్ ద డే. లేదా లేటెస్ట్ లోక తీరు. కనుక, శోభనం వధువుగారు సత్వరమే శోభన గది ప్రవేశం జరిపించ ప్రార్థన. అయినా పెళ్లిలో తల దూర్చి శోభనం పోటుకి వెరువ దగునా? నటన చాలించి నడవండి. మీలాటి వారి కోసమే తెలుగు సినిమా కవులు- 'ఎవరికి తెలియ దులే ఇంతుల సంగతి...' 'ఆలూమగల మధ్యనున్నదీ ఎవరికి తెలియదని?' లాంటి పాటల ద్వారా ప్రాచీన కాలం నుంచీ ప్రేక్షకులకు చలన చిత్రాల ద్వారా సెక్స్ ఎడ్యుకేషన్ సరఫరా చేస్తునే ఉన్నారు. తమరు గ్రహించే ఉంటారు- బయటకు చెప్పకపోయినా. పిల్లి కళ్లు మూసుకున్నంత మాత్రాన లోకం కళ్లు మూసుకుంటుందా?' పలువ రస కనిపించేలా నవ్వింది.

వీళ్ల పరిహాసాలు భరించడం కంటే గదిలోకి వెళ్లడమే నయమనిపించింది కాదంబరికి. గదిలోకి వెళ్లీ వెళ్లడంతోనే తనే ధడేల్మని తలుపు మూసేసి, గడియ పెట్టేసి, అప్పుడు వెనక్కి తిరిగి చూసింది.

మంచం మీద కొత్త దుప్పటి మీద కొంచెం పువ్వులు. గదిలో ఒక ముఖం. బల్లమీద వెలుగు తున్న అగర్ బత్తీ వెలువరిస్తున్న సుగంధభరితమైన పొగ. ఆ పక్కన టీపాయి మీద పళ్లు, మిఠాయిలు, ఫ్లాస్కులు, పూలు. మంచం మీద- హెడ్ బోర్డ్‌కి దిండు దాపు పెట్టి- దాని మీద తల పెట్టుకుని విలా సంగా చూస్తున్న కామేశ్వరరావ్.

ఆమెకి పుండు మీద కారం జల్లినట్లే అయింది. విస విస అటు నడిచింది.

''కొందరాడవాళ్లు కోపంలో కొత్త అందాలు ప్రదర్శిస్తారన్నది నిజమే సుమీ!'' చిరునవ్వు నవ్వా డతను.

''సిగ్గు లేకపోతే సరి-'' సర్రున తారాజువ్వలా ఎగసి పడిందామె కోపం. దానితో ఆమె పచ్చని ముఖం- పెట్టుకున్న బొట్టు రంగుకి పోటీ పడుతు న్నట్లు ఎర్రనయింది.

''సిగ్గు పడుతూ తలుపు దగ్గర ఆగడం అనేది నీ వంతు యాక్షన్. నువ్వు అలా ఆగితే నేను కూడా కొంచెం సందేహిస్తున్నట్టు సిగ్గు పడుతున్నట్లు వొచ్చి నిన్ను పట్టుకుని నడిపించి...''

ఆమె చటుక్కున అడుగు ముందుకు వేసి, ''చేసిన నిర్వాకం చాలు. సిగ్గూ శరమూ లేకుండా ఏం మాటలవి? అసలు నాదే తప్పు. మీరు తాన అంటే తందాన అన్నందుకే కదా...''

''కాదంబరీ! నేను తాన అనీ అన్లేదు; నువ్వు తందాన అనీ అన్లేదు. అయినా నీ కింత కోపం తెప్పించిన వారెవరు?'' అమాయకంగా ముఖం పెట్టాడు కామేశ్వరావ్.

''చేసిందంతా చేసి ఏమీ ఎరగనట్లు ఆ నటన దేనికీ? మీకంత సరదాగా ఉంటే నన్నే నేరుగా అడి గితే సరిపోయేది. ఈపాటి పెళ్లికి హిందూస్తానీ మేళమా అని.... ఛీ! మీకేం, మగాళ్లు. నేనెంత నవ్వులపాలు, అలుసూ ఐపోయానని...''

''ఎవరి ముందు? నిన్ను అలుసు చేయగల ధైర్య సాహసాలెవరికి?'' కోపం నటిస్తూ, ''నేనింకా బతికే ఉన్నానని తెలియదా ఆ మూర్ఖులకి?'' అన్నాడు కామేశ్వరావ్ గట్టిగా.

''మన బంగారం మంచిదయితే కంసాలిననే పనేముంది? మీరు తెలివయిన వారు కదా, మొగుడు 'ముండా' అంటే ముష్టి కొచ్చిన వాడూ ముండా అని పిలిచాడన్న సామెతలో సందేశం గ్రహించలేరని అనుకోలేను...''


''ఏమిటీ... నీ ధోరణి నీదే కాని విషయం చెప్ప వు- నా కర్థమయ్యేలా, సూటిగా...''

''మీరు పెళ్లి పేరుతో నన్ను పీటల మీద కెక్కించ బట్టే వీళ్లు శోభనం పెళ్లి కూతురంటూ నన్ను నానా పరిహాసాలూ ఆడి నా పెద్దరికాన్ని, అధికారాన్నీ నిలువునా గోతిలో పాతేశారు. వీళ్ల తప్పేముంది? గొడ్డు గోతిలో పడితే ఎవరేనా నిర్భ యంగా రాయి విసురుతారు. అసలు తప్పు నాదే. నా గౌరవము, స్థానమూ ఆలోచిస్తారని అపోహ పడ్డాను. మీరు 'ధనం' దృష్ట్యా ఆలోచిస్తారని గుడ్డిగా నమ్ముతూ మీరు ఏం చెబితే దానికి గంగిరె ద్దులా తలూపుడం నాదే తప్పు. నన్ను కోతిని చేస్తా రనీ, కోడళ్ల ముందు కించపరిచి రేపటి నుంచి నేనే వాళ్లకి అణగి మణగి ఉండేలా అణచి వేసే ప్రణాళిక వేస్తారనీ అనుమానమైనా రాకపోవడం నాదే తప్పు. వెర్రి దాన్ని చేసి, వినోద సాధనం చేసి, తలెత్తు కోకుండా మీరే చేస్తారని అనుకోలేకపో యాను. ఇప్పుడు జరిగిన దానితో... బొట బొటా కన్నీరు కార్చేసింది కాదంబరి.

కామేశ్వర్రావ్ ఆమెను దగ్గరగా తీసుకుని కన్నీరు తుడవబోతే, అతని చేతిని విదిలించి పారేసి, అంతలోనే తప్పుచేసినట్లు, ''మరచిపో యాను. నేను మీకేమీ కాననీ, నేను కాదంటే ఏ వేశ్య వద్దకో పోగలరనీ, నా అవసరం కానీ నా మీద ప్రేమ కానీ మీ కేమీ లేదనీ, ఆత్మాభిమానం లేని ఆడదాన్ననీ, మీరు కాలితో తన్నినా ఎక్కడికీ పోలేను కనుక మీ పాదాల వద్దే పడుండే దానిననీ...''

ఇక అతను భరించలేక పోయాడు, కాదంబరీ! ఏమిటీ అర్థంలేని మాటలు, ప్రయోజనం లేని శోకమూ?''

''షష్టిపూర్తి చేస్తామని అబ్బాయిలూ కోడళ్లూ ఉబలాటపడుతున్నారని మీరంటే- నేను తక్షణమే ఏభై రెండేళ్ల వధువునయ్యాను. అంతవరకూ సరే; కాని, యీ శోభనం కార్యక్రమమేమిటి? మగాళ్లకు మీకు సిగ్గుండకపోవచ్చు. కాని ఏభై రెండేళ్ల ఆడదా నికి, ముగ్గురు కొడుకుల తల్లికి, ముగ్గురు కోడళ్లూ శోభనం గదిలోకి పంపుతూంటే, ఎన్నో పరిహా సాలు చేస్తూంటే, మనసు సిగ్గుతో ఎంత ముడుచు కుని చస్తుందో కొంచెమయినా ఆలోచించారా? వీళ్ల ముందు... నేను... శోభనం గదిలోకి... మీ దగ్గ రకి... నిస్సిగ్గుగా... నిర్లజ్జగా... ఛీ! రేపటినుంచీ



వాళ్ల ముందు ముఖం ఎలా ఎత్తుకునేది? ఇక వాళ్లు నన్నూ నా మాటనీ ఏం గౌరవిస్తారు? దీనంతటికీ మీరే కారణం!'' అరిచినట్లే అని, మళ్లా శోకం ప్రారంభించింది కాదంబరి.

''నిజమే. దీనికి కారణం నేనే,'' ఒప్పుకుంటున్నట్లే అన్నాడు కామేశ్వర్రావ్. ఆమె తుళ్లి పడింది.

''ఔనా! నిజమేనా? ఎందుకిలా నన్ను కోడళ్ల ముందు బద్‌నామ్ చేశారు. మీకు సరదా కలిగిందని చెబితే నేను కాదంటానా? అన్నానా ఎప్పుడయినా? నా యిష్టా యిష్టాలతో... కష్ట సుఖాలతో నిమిత్తం లేకుండా ఆరోగ్యం గురించి ఆలోచించకుండా మీ శృంగార సేవ చేయలేదూ? మీ యిచ్ఛ తీర్చుకుందుకున్నిలా రచ్చకీడ్వాలా? నేను మీ భార్యనే, విధేయురాలినే!''

''కాదంబరీ నీ మనసులో బాధ నాకర్థమయింది. నా ఆలోచనే నువ్వర్థం చేసుకోలేక పోయావు. విప్పి చెప్పకపోడం నాదీ తప్పే. ఇప్పుడు ఆలస్యంగా అయినా చెబుతాను. శాంతంగా, ఆవేశపడకుండా విను. ముందు నాకు నువ్వంటే చాలా అనురాగమనీ, నీ పరువూ, పెద్దరికమూ నేనెన్నటికీ భంగపరచననీ విశ్వసించు. అప్పుడే నా ఆలోచన నీ కర్థమౌతుంది,'' అన్నాడతను కొంచెం గంభీరంగానూ, చిత్త శుద్ధీ నిజాయితీ నిండిన కంఠ స్వరంతోనూ. ఆమె తలెత్తి, కళ్లు తుడుచుకుని చూసింది.

''ఇది మన తరం కాదు. ఈ తరం వారు మనలా ఆలోచించేవారూ కాదు. ఇప్పుడంతా షో. మనకి నిజంగా ఉండడం కంటే- మనకి ఉందని యితరులు భావిస్తేనే గొప్ప. అదే వారికి ఆనందం. అర్థం కాలేదా? స్పష్టంగా చెబుతాను విను. కారులో తిరగడం కంటే, నీకు కారుందని యితరులు తెలుసుకున్నారన్నదే ఎక్కువ ఆనందమిస్తుంది. అందుకే- అవసరమున్నా లేకపోయినా, అప్పు చేసయినా గొప్పలకి పోవడం. అప్పు తప్పనీ, నిప్పులో కాల్చేస్తుందనీ గ్రహించదు నేటి తరం. హంసలా కనిపించడమే ప్రధానం.''

''మీరు సంబంధం లేని మాటలు చెబుతున్నట్లున్నారు...''

అతను నవ్వి, ''కొడుకులు ఉద్యోగస్తులు. నేను నెలన్నర కిందట పదవీ విరమణ చేశాను. ఏదైనా అవకాశం వస్తుందా తమ గొప్పతనం వీలయినంత మందికి ప్రదర్శిద్దాం అని చూసే వారికి నాకు షష్టి పూర్తి మహోత్సవం జరపవొచ్చునని తట్టింది. అంతే కోతికి కొబ్బరికాయ దొరికినట్లు ఆనందంతో నా ముందు ప్రతిపాదించేశారు...''

''మీరెందు కొప్పుకోవాలి?'' నిలదీసినట్లే అడిగింది.

''అర్థాంగివీ, మనసులో మనసువీ కనక- సిగ్గూ, అహమూ వదిలి నిజం చెబుతున్నాను. జాగ్రత్తగా విని అర్థం చేసుకో. ఆలోచించు...''


ఆ కంఠ స్వరంలోని తీరూ, ఆ మాటలూ, రహస్యం వినబోతున్నందుకు శ్రద్ధా... ఆమె సర్దుకుని బుద్ధిగా కూర్చుంది.

''రిటైరయిన పదవ రోజు. పింఛను కాగితాలను పంపారో లేదో తెలుసుకుందామని ఆఫీసుకి వెళ్లాను. నువ్వు నమ్మలేవేమో కాని- ఉద్యోగంలో ఉండగా నన్ను చూసి ఎంతో భయ భక్తులు ప్రదర్శించిన నా సబార్డినేట్స్ మామూలుగా మర్యాదకయినా నమస్కారం అననూ లేదు, పెట్టనూ లేదు! విధి లేనట్లు ఓ చిరునవ్వు నవ్వారంతే. నా సుపీరియర్స్ నాతో మాట్లాడడానికి కాస్సేపాగమన్నారు! అది నా కెంత అవమానమో... పరాభవమో... అనుభవించిన నాకే అర్థమౌతుంది. 'అధికారాంతమునందు చూడవలె అయ్యగారి పస' అని పూర్వులు సత్యం చెప్పడమే కాక, అంతర్లీనంగా సలహా కూడా యిచ్చారనిపించింది. కనీసం యిక నుంచయినా దానిని పాటించడం మంచిదనిపించింది.

చాలా కోణాలలో కార్యాలయమూ, యిల్లూ ఒకలాటివే. మానేజ్ చెయ్యడంలో చాలా తెలివి ఉపయోగించాలి. హోమ్ డిపార్ట్‌మెంట్ అనడంలోనే దాని ప్రాముఖ్యత తేటతెల్లమౌతుంది...'' కాదంబరి ఆవలింత ద్వారా ఉపన్యాసానికి అయిష్టత తెలిపింది.

''ఇంతవరకూ నేను యీ యింటికి అధికారి, ఉద్యోగి అయిన యజమానిని. అంటే- అన్ని విధాలా రాజుని, నువ్వు మహారాణివి. కాని ఉద్యోగం నుంచి దూరమైన నేను - తీసేసిన తాసిల్దారుని కాకపోయినా- మాజీ తాసిల్దారుని. 'తీ.తా'కీ 'మా.తా'కీ కొంచెమే తేడా. పాతాళ భైరవి సినిమాలో రాజుగారూ, రాజు గారి బావమరిదిలా- గృహ జీవితంలో నేను మహారాజుగా సింహాసనం మీదున్నంత కాలమే, నువ్వూ మహారాణిలా మనగలవు - పువ్వుతో కూడిన దారం శిరస్సు మీద పెట్టుకోబడ్డట్లు. యువరాజులు వచ్చి మహారాజుగారి స్థానం ఆక్రమించాక రాజుగారే బూజులా మూలనుండాలి. ఇక రాజుగారి భార్యకి, బావమరిదికీ పవరేముంటుంది? కాని పవరు లేకపోయినా పరువు నిలబెట్టుకోవాలి. మేకపోతు గాంభీర్యం నటించాలి. అధికారం లేదు కనుక మంచితనం తోనే మాట దక్కించుకుంటూ పెద్దరికం నిలుపుకోవాలి. సింహం ముసలిదైనప్పుడు- లేళ్ల గుంపు మీదకు పరుగెత్తబోతే, దాని అసమర్థత, అశక్తీ బట్టబయలై పోతాయి. అలాంటి పరిస్థితి తెచ్చుకోకూడదు. మనకి- మనమేమిటనే దాని కంటే- నలుగురూ మన గురించి ఏమనుకుంటారనేది ముఖ్యం కదా? ఉద్యోగపు కోరలు విరిగిపోయినా మరోలా మంచితో నిర్వహించాలని నిశ్చయించుకున్నాను. అంతకంటే చేయగలిగేదేముంది? అసమర్థుడి కంటె మంచి వాడుండడు. అలా ఆలోచిస్తుంటే- అబ్బాయిలు ముప్పేట దారంలా వచ్చి- 'నాన్నగారూ! మీకు షష్టిపూర్తి మహోత్సవం జరపాలనుకుంటున్నాం,' అన్నారు ముక్తకంఠంతో. నేను ఆలోచించాను. వాళ్లు సంపాదనాపరులు. ప్రస్తుత సమాజంలో జీవన శైలి కనుగుణంగా నలుగురిలోనూ గొప్ప ప్రదర్శించుకోవాలనుకుంటున్నారు. అందుకు అవకాశంగా నా షష్టిపూర్తిని తీసుకోవాలనుకుంటున్నారు. నాకిష్టం లేదు. వొద్దు,' అని ఒక్క మాటతో వారి ప్రతిపాదనని తిరస్కరించవచ్చు. కాని దాని వల్ల మనకి జరిగే మంచేమీ ఉండదు, వాళ్లకి చెడ్డకావడం తప్ప. ' అంటే మనకెన్ని లాభాలు భవిష్యత్తులో! ఇలా అంగీకరించడాన్ని గుర్తు చేసి మరేదయినా సాధించుకోవచ్చు. ఈ ప్లస్ పాయింటు తురుపు ముక్కలా ఉంటుంది.

ఏమిటలా చూస్తావ్? మొన్నటి వరకూ ఉద్యోగినీ- నలుగురినీ చూస్తూ వచ్చిన వాడినీ- లోకం ప్రస్తుతం ఎలాంటి పోకడలు పోతూందో తెలిసిన వాడినీ కనుక నీకిలా వివరించవలసి వస్తోంది. చాలాకాలం కిందటి వరకూ మానవ సంబంధాలు





ప్రధానంగా హార్దిక సంబంధాలు. తరువాత ఆ స్థానాన్ని ఆర్థిక సంబంధాలు ఆక్రమించుకున్నాయి. ఇప్పుడు అధికార సంబంధాలు కూడా వీటిలో చోటు చేసుకున్నాయి. ఎదుటివారి మీద ఆధిక్యత ప్రదర్శించాలని ఉవ్విళ్లూరే వారే మరొకరు తమ మీద పెత్తనం చలాయించబోతే భరించలేరు. ఇది సహజం. ఇన్నాళ్లూ- వాళ్ల మంచికే అయినా- మనం తెలిసీ తెలియక కూడా పెద్దరికం చెలాయించి ఉంటాం. అప్పుడు వాళ్లలో కలిగిన ప్రతిస్పందన తక్షణం బయటపడడానికి అవకాశం లేక, అంతరంగంలో పేరుకుంటూ, వర్షం పడగానే భూమిలోంచి కొన్ని మొక్కలు బయటపడ్డట్లు మన పరిస్థితి బలహీనపడగానే, వారికి మన మీదుంటూ వచ్చిన కోపమూ, కసీ, నిరసనా, ప్రతీకార వాంఛా బయటపడవచ్చు.''

''తుంటిని కొడితే పళ్లు రాలాయన్నట్లు మీరు చెబుతున్న దానికీ, యీ అరవయ్యో ఏట అగ్నిగుండంలా యీ శోభనానికీ సంబంధమేమిటి?'' కాదంబరిలో యింకా కోపం మిగిలే ఉంది.

''ఉంది కనుకనే ఉపన్యాసం. వారు ఒకందుకు పోస్తే వీరు ఒకందుకు తాగారని అబ్బాయిలు తమ గొప్పతనం చూపుకుందుకు నా షష్టిపూర్తి వేడుక ఏర్పాటుచేయగా, నేనేమో వారిని కాదనడం వల్ల కాక, ఔననడం ద్వారానే మన స్థానం పదిలపరచుకోవచ్చని భావించి తలవంచాను. వాళ్లు మనని రాళ్లూ గుళ్లూ ఎత్తమనడం లేదు; సిల్కు గుడ్డలు కట్టుకుని పెళ్లి పీటల మీద కూర్చోమంటున్నారంతే కదా. నువ్వూ పట్టు చీర కట్టుకుని పక్కన కూర్చుంటావు; అంతే తప్ప శ్రమ పడి పోయేదేమీ ఉండదు- అనుకున్నాను.''

''నేనడుగుతున్నది పెళ్లి గురించి కాదు. దాని తరువాత కార్యక్రమం గురించి. ఈ శోభనం గదిలోకి నన్ను పంపుతూ కోడళ్లు ఎలా ఆడుకున్నారో మాటలతో...''

''అనుకోకుండా జరిగిన మంచి అది. క్షౌరం చెయ్యకు. కోడళ్ల ప్లానే అయి ఉంటుందీ శోభనం. అంతవరకూ వీళ్ల అంతరంగంలో ఉన్న వ్యతిరేక భావాలు నిన్ను ఆటలు పట్టించడం ద్వారా చాలావరకూ సమసిపోయి ఉంటాయి. కొద్దిసేపే అయినా, వీళ్లకి నీ మీద పై చెయ్యి కావడం అనే సంతృప్తి విలువ తక్కువ కాదు; త్వరగా పోయేదీ కాదు. ఒక్కసారే అయినా... ఓడలూ బళ్లూ, బళ్లు ఓడలూ అయితే బళ్లకెంత ఆనందమని! ఇందాకా నిన్ను శాసించీ, ప్రతి చిన్నదానికి హితవు చెప్పీ వాళ్లు నీకు ఎంత దగ్గరౌతారో చూద్దువు గాని నువ్వే. ఈ చిన్న విజయం- నీ మీద వాళ్లు తీసుకున్న పెద్దరికం- రేపటి నీ మంచికే. చాలామంది తమకంటే తక్కువగా ఉన్నవారినే స్నేహితులుగా భావించగలరు. సన్నిహితంగా ఉండగలరు. నువ్వు నీ కోడళ్లని అమ్మాయిలుగానే భావించినా వాళ్లూ నిన్ను అమ్మగా భావించాలంటే అప్పుడప్పుడూ వాళ్లది నీ మీద పైచేయి అయేలా చూసుకోవడం మానవ మనస్తత్వానికి సంబంధించిన కిటుకు.''

మీరు ఎంతకేనా సమర్థులే!

''సరే కాని... రేపు వాళ్లు సరదాగా ఏమయినా అడిగితే మృదువుగా నవ్వేసి- పొండి, అల్లరి పిల్లల్లారా!'' అనేయ్ తప్ప ఆగ్రహించకు. ఫలితాలు త్వరలోనే తియ్యగా ఉంటాయ్. ఆ... నీకు నిద్ర వస్తున్నట్లుంది. నాకు టాబ్లెట్ యిచ్చి మరీ నిద్రపో.

❑